క్లుప్తంగా

మార్షల్ ఆర్ట్స్ సంఘం అధ్యక్షుడిగా మధు



కొడకండ్ల: జనగామ జిల్లా మార్షల్ ఆర్ట్స్ సంఘం అధ్యక్షుడిగా మండలంలోని పాకాల గ్రామానికి చెందిన వీరదాసు మధు ఎన్నికయ్యాడు. హైదరాబాద్‌లోని కాప్రా మౌంట్ లిటరాజీ స్కూల్‌లో తెలంగాణ ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లాల నూతన అధ్యక్షులను ఎన్నుకొన్నారు. వీఎంఎస్ హంటర్స్ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఫౌండర్ మధు జనగామ అధ్యక్షుడిగా ఎన్నికై చైర్మన్ సత్యశంకర్, అధ్యక్షుడు చందర్ ద్వారా నియామక పత్రాన్ని అందుకున్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహేష్



జనగామ రూరల్: పట్టణంలో సోమవారం ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా బొట్ల మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధికి పని చేస్తానని మహేష్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞత తెలిపారు.

'పల్లా'ను కలిసిన నాయకులు



బచ్చన్నపేట : రైతు బంధు సమితి రాష్ట్ర కోఆర్డినేటర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని హైదరాబాద్‌లో మండల నాయకులు సోమవారం కలిశారు. రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, మండల అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డిల సారథ్యంలో వందల వాహనాల్లో కార్యకర్తలు, ప్రజాప్రతినిధులను రాజేశ్వర్‌రెడ్డిని కలిసేందుకు తీసుకెళ్లారు. పల్లా ముద్దు.. పోచంపల్లి వద్దు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జిల్లా కోఆర్డినేటర్ రమణారెడ్డి , వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్ రెడ్డి, సర్పంచ్‌లు వడ్డెపల్లి మల్లారెడ్డి, నరెడ్ల బాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్, ఎంపీటీసీ వేణుగోపాల్, నాయకులు ఉన్నారు.

రవికుమార్‌కు అంబేడ్కర్ నేషనల్ అవార్డు



కొడకండ్ల: డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ జాతీయ అవార్డు 2023ను పాకాల గ్రామానికి చెందిన పాలకుర్తి నియోజకవర్గ బీఎస్పీ కన్వీనర్ జిలుకర రవికుమార్ అందుకున్నాడు. సోమవారం హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతులమీదుగా అవార్డును స్వీకరించారు.

నివాళి



దేవరుప్పుల: మండలంలోని కామారెడ్డి గూడానికి చెందిన బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చింత సృజన్‌కుమార్ తండ్రి చంద్రయ్య సోమవారం మృతి చెందాడు. కాగా మృతదేహానికి బీఆర్ఎస్ మండల సమన్వయ కర్తలు పల్ల సుందర్‌రామిరెడ్డి, బస్వ మల్లేషం పూలమాల వేసి నివాళులర్పించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మండల నాయకులు చింత రవి, సుడిగెల హన్మంతు, తాటిపెల్లి మహేష్, నర్సింహ్ములు, బానోతు నవీన్, రమేష్, మల్లేషం తదితరులు ఉన్నారు.

ఎన్నిక



నాగరాజు, అధ్యక్షుడు

జఫర్‌గఢ్: మండలంలోని హిమ్మత్‌నగర్‌లో వాలీబాల్ యూత్ అసోసియేషన్ గ్రామ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాలీబాల్ యూత్ నూతన అధ్యక్షుడిగా పిట్టల నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా ఉపాధ్యక్షుడిగా చిడిమల్ల మల్లన్న, ప్రధాన కార్యదర్శిగా నీరటి రామకృష్ణ, కార్యదర్శిగా కొడిమాల రంజిత్, కోశాధికారిగా మేర్గు కాశోజీ, ప్రచార కార్యదర్శిగా మందపురి శివమణి, నీరటి నాగరాజు క్రీడారంగం ఇన్‌చార్జ్‌లుగా తాళ్లపల్లి మోహన్‌కృష్ణ, తాటి కాయల వంశీ ఎన్నికైన వారిలో ఉన్నారు. కాగా, గౌరవ అధ్యక్షుడిగా మహేష్, వెంకటేష్, సంతోష్, ప్రశాంత్, శ్రీకాంత్, రాజు, భరత్ ఎన్నికైన వారిలో ఉన్నారు.

వృథాగా గోదాం భవనం

- విని‌యోగంలోకి తేవాలంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న గోదాం భవనం

చిల్పూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వెనకాల వాగు సమీపంలో 600 గజాల స్థలంలో 30 ఏళ్ల క్రితం రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు విశాలంగా నిర్మించిన గోదాం భవనం వృథాగా ఉంటోంది. చుట్టు పక్కల ఎవరూ లేక పోవడంతో ప్రస్తుతం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం గదులు మరుగుదొడ్లను తలపించేలా ఉన్నాయి. రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకోవడమే కాకుండా, సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా కోఆపరేటివ్ సొసైటీ వారు భవనాన్ని నిర్మింపజేశారు. అప్పటి నుంచి 15 ఏళ్ల పాటు అందులో రైతుల సమావేశాలు, ధాన్యం నిల్వ చేసేవారు. రానురాను భవనానికి వెళ్లే దారి గుంతలమయం కావడంతో పాటు వాగు నీటితో కోతకు గురవడంతో అక్కడికి వెళ్లడం మానుకున్నారు. కొద్ది నెలల పాటు కాపలాగా ఒక వ్యక్తిని ఏర్పాటు చేసి అతనికి జీతం ఇవ్వక పోవడంతో బంద్ చేశాడు. దీంతో వృథాగా భవనం ఉండిపోయింది. భవనానికి ఉన్న తలుపులు, కిటికీలను ఎత్తుకెళ్లారు. భవనానికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

భవనాన్ని వినియోగంలోకి తేవాలి



30 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం నేటికీ చెక్కుచెదరలేదు. ప్రస్తుతం ప్రభుత్వ భవనాలు అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి. అధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలి.

- మారేపల్లి శ్యాంకుమార్‌రెడ్డి

నిర్లక్ష్యం ఎందుకో..



మండల కేంద్రం కావడంతో కార్యాలయాలను ఏర్పాటు చేసుకునేందుకు భవనం ఎంతో అనుకూలంగా ఉంటుంది. పూర్తిగా శిథిలావస్తకు చేరుకోక ముందే అధికారులు నిర్లక్ష్యం వీడి బాగుచేయించేయించాలి.

- గనగోని రమేష్, స్థానికుడు

అధికారులు ఆదేశిస్తే వినియోగంలోకి తెస్తా



మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు గదుల కొరత ఉంది. వృథాగా ఉంటున్న గోదాం భవనం రిపేరుకు అధికారులు ఆదేశించి నిధులు మంజూరు చేస్తే వినియోగంలోకి తీసుకవస్తా.

- ఉద్దెమారి రాజ్‌కుమార్, సర్పంచ్

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

జనగామ రూరల్: అర్హులైన ప్రతీ ఒక్కరికి కొత్తరేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం జనగామ చౌరస్తా వద్ద పెరిగిన ధరలతో ముద్రించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి రేషన్ కార్డులు, బియ్యంలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, వృద్ధులు, కొత్తగా వివాహం అయిన వారికి కార్డులు ఇవ్వాలన్నారు. అలాగే కొత్త పింఛన్ కూడా అర్హులకు ఇవ్వాలన్నారు. నాయకులు జోగు ప్రకాష్, లలిత, శ్రావణ్, లింగం, అంజమ్మ, రజిత, లక్ష్మి, శ్రీకాంత్, వెంకటేష్, మధు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికను శుభ్రంగా ఉంచండి



శ్మశాన వాటికలో శుభ్రం చేయించిన సర్పంచ్

చిల్పూరు: గ్రామంలో ఎవరైనా మృతి చెందితే శ్మశాన వాటికను ఉపయోగించుకున్న వారు తదుపరి శుభ్రం చేయించాలని సర్పంచ్ కర్ణకంటి స్వప్నవెంకటేష్ కోరారు. మండలంలోని నష్కల్‌లో సోమవారం మాట్లాడుతూ శ్మశాన వాటికలో దహన సంస్కారాలు పూర్తిచేసిన వారు చెత్తాచెదారాన్ని అలాగే వదిలివేయడంతో మరొకరు వస్తే ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇక్కడ పనిచేసేవారు ప్రత్యేకంగా లేరని, ఇక నుంచి వచ్చినవారు శుభ్రం చేయించాలన్నారు.

ఆలయ ప్రారంభోత్సవానికి తరలిన ప్రజలు



వల్మిడికి తరలిన ప్రజాప్రతినిధులు, ప్రజలు

కొడకండ్ల: పాలకుర్తి మండలం వల్మిడిలో సోమవారం జరిగిన సీతారామచంద్రస్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో ప్రజాప్రతినిధులు, ప్రజలు తరలి వెళ్లారు. మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో భక్తులు, ప్రజలు వల్మిడికి వెళ్లారు.

ఘనంగా పోచమ్మ విగ్రహావిష్కరణ



చండీ హోమంలో పాల్గొన్న భక్తులు



మొక్కులు చెల్లించుకుంటున్న ఝాన్సీరెడ్డి

జనగామ రూరల్: పట్టణంలోని టీఎన్జీఓ కాలనీ అంబేడ్కర్ నగర్‌లో పోచమ్మ తల్లి దేవాలయంలో విగ్రహావిష్కరణ సోమవారం అంగరంగ వైభవంగా మూడు రోజుల నుంచి జరుగుతున్నాయి. ఇందులో భాగంగా జలాధివాసం, ధాన్యవాసం, గణపతి, చండీ హోమం వేదపండితులతో నిర్వహించారు. భక్తులందరు కుటుంబ సమేతంగా పాల్గొని భక్తిశ్రద్ధలతో హోం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సానం రాజనర్సయ్య, సెక్రెటరీ బండపల్లి సోమేష్, కోశాధికారి కాసాబు రాజేష్, మాధవ్, బిక్కు, యాదగిరి, విజయపాల్ రెడ్డి పాల్గొన్నారు.

పోచమ్మ తల్లికి మొక్కులు

దేవరుప్పుల: మండలంలోని అప్పిరెడ్డిపల్లెలో పోచమ్మ, బోనాల పండుగ ఉత్సవాల్లో పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటం , మహిళ సంఘాలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బిషప్ ఉడుముల బాలను కలిసిన ఇందిర



బిషప్ ఉడుముల బాలతో సింగపురం ఇందిర

స్టేషన్‌ఘన్‌పూర్: కాజీపేటలోని బిషప్‌హౌస్‌లో వరంగల్ బిషప్ రెవరెండ్ ఉడుముల బాలను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బిషప్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, జిల్లా నాయకులు ఇనుగాల వెంకటేశ్వరరెడ్డి, చింత ఎల్లయ్య, మండల నాయకులు కోరుకొప్పుల మహేందర్‌గౌడ్, సింగపురం నాగయ్య, సింగపురం వెంకటయ్య, రాజు, జ్యోత్స్న, పద్మ పాల్గొన్నారు.

పరామర్శ

రాఘవాపూర్‌లో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గంగుల మహేష్‌రెడ్డి తండ్రి గంగుల వాసుదేవరెడ్డి, అదే గ్రామానికి చెందిన గంగుల రంగారెడ్డి, జఫర్‌గఢ్ మండలం వడ్డెగూడేనికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మంచాల సాంబరాజు ఇటీవల అనారోగ్యంతో మృతించెందగా ఇందిర బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు.

భక్తి భావాన్ని చాటాలి



బచ్చన్నపేట: ప్రతీ ఒక్కరు హిందూ దేవుళ్లను పూజిస్తూ భక్తి భావాన్ని చాటాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాటి బీరప్ప అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6న కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి, హిందూ జ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్‌శ్రేష్ఠి , నాయకులు కొత్తపల్లి రాజయ్య, కొన్నె ఉపేందర్, శివకుమార్, లక్ష్మి రిషి, వీరస్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వల్మిడి సీతారామ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి తరలివస్తున్న భక్తులు



కనులపండువగా ప్రతిష్ఠాపనోత్సవం



ప్రతిష్ఠాపనోత్సవంలో భక్తులు



కళాకారుల డోలు ప్రదర్శన

పాలకుర్తి మండలం వల్మిడిలో నిర్మించిన ఆలయంలో సీతారామ చంద్రుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం కనుల పండువగా సాగింది. త్రిదండి చిన జీయర్‌స్వామి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. సీతారామ సమేత లక్ష్మణుడు, ఆంజనేయుడి విగ్రహాలను, గోపురంపై కలశాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు కాషాయ రంగు జెండాలను ప్రదర్శిస్తూ జై శ్రీరాం అంటూ నినదించారు. అనంతరం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సుదర్శన చూర్ణాన్ని అందజేస్తున్న ప్రీతి

కొడకండ్ల: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయూష్ డాక్టర్ వి.ప్రీతి సూచించారు. సోమవారం మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో సీజనల్ వ్యాధులపై వైద్య శిబిరాన్ని నిర్వహించి విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు, సుదర్శన చూర్ణాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో దోమల ద్వారా మలేరియా, డెంగీ వంటి జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, దోమల నివారణ చర్యలు తీసుకోవాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, జ్వరం వచ్చిన వేంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కస్తూర్బా విద్యాలయ స్పెషలాఫీసర్ పేరం శారద, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైకుంఠరథాల అందజేత



వైకుంఠ రథాలను ప్రారంభిస్తున్న మంత్రులు

పాలకుర్తి టౌన్/కొడకండ్ల: ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పాలకుర్తి నియోజవర్గంలోని పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాలకు వైకుంఠ రథాలను అందజేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆ రథాలను మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యే ఆరూరి రమేష్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'కడియం శ్రీహరి గెలుపునకు కృషి'



కడియం శ్రీహరితో రెడ్డి సంఘం నాయకులు

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన రెడ్డి సంఘం నాయకులు సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి గెలుపునకు తమసంఘం కృషిచేస్తుందని అన్నారు. యాదవరెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజిరెడ్డి, రామ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, రఘుపతిరెడ్డి, సతీష్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



దేవరుప్పుల: మండలంలోని మున్‌పహాడ్‌లో అకాల మృతి చెందిన వేల్పుల మల్లయ్య కుటుంబానికి సర్పంచ్ వర్రె మధు అర క్వింటా బియ్యం అందజేశారు. మంత్రి దయాకర్‌రావు సహకారంతో బాధిత కుటుంబానికి ప్రభుత్వపరమైన సాయం అందించేందుకు తోడ్పాటు అందిస్తామన్నారు. బీఆర్ఎస్ గ్రామ పార్టీ నాయకులు బస్వ సోమనర్సయ్య, మామిండ్ల చెమ్మయ్య, లక్ష్మయ్య, వెంకీ యాదయ్య, జోగు పరశురాములు, దొంతురాజు పరిపూర్ణాచారి, బస్వ బయ్యన్న పాల్గొన్నారు.

బియ్యం అందజేత

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఇందిరా నగర్‌లో ఇటీవల మృతి చెందిన మాచర్ల పోచయ్య కుటుంబానికి టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య పంపించిన బియ్యం ఆ పార్టీ నాయకులు అందజేశారు. సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు కోడూరి మహాత్మాచారి, అల్వాల రమేష్, చెరుకూరి శ్రీనివాస్, అవధూత శ్రీనివాస్, బల్లెపు యాదగిరి , సంపయ్య, శ్రీనివాస్, అఖిల్, భాస్కర్ పాల్గొన్నారు.

పాడె మోసిన ఎమ్మెల్యే రాజయ్య



పాడె మోస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ సట్ల యాకయ్య తండ్రి బుచ్చయ్య అనారోగ్యంతో మృతిచెందగా అతడి మృతిపట్ల ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ప్రగాఢ సంతాపం తెలిపారు. సోమవారం ఇప్పగూడెంలో బుచ్చయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో మృతుడి పాడెను ఎమ్మెల్యే మోశారు. ఆకుల కుమార్, గుజ్జరి రాజు, మండపురం ఎల్లగౌడ్, సురేష్‌గౌడ్, లింగన బోయిన శ్రీను, మహేష్ ఉన్నారు.

పరామర్శ

ఇప్పగూడెం గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు సట్ల సత్యం తండ్రి సట్ల బుచ్చయ్య, బీజేపీ నాయకుడు కర్నె శ్రీనివాస్ భార్య రమ అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాలను బీజేపీ రాష్ట్ర నాయకుడు బొజ్జపల్లి సుభాష్ పరామర్శించారు. ఇనుగాల యుగేందర్‌రెడ్డి, ఐలోని అంజిరెడ్డి, భాస్కుల ఆరోగ్యం, ఉపేందర్, చట్ల రాజ్‌కుమార్ ఉన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడి ప్రమాణస్వీకారం



క్లబ్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న శంకర్‌రెడ్డి

రఘునాథపల్లి: లయన్స్ క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన శంకర్‌రెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా ప్రదీప్‌కుమార్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. మండల కేంద్రంలోని ఎల్‌బీబీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఏడో కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి 320 ఎఫ్ పూర్వ గవర్నర్ లయన్ కన్న పరశురాములు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కన్న సమక్షంలో వారు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పరశురాములు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. జిల్లా ఉప గవర్నర్ కె వెంకట్‌రెడ్డి, యాదగిరి, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు యాదిరెడ్డి, పూర్వ జోన్ చైర్మన్ శ్రీకాంత్, పూర్వ అధ్యక్షుడు కూరెళ్ల ఉపేందర్, శంకరయ్య, లక్ష్మణ్, రవి, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.